క్లుప్తంగా

ట్రైబల్ యూనివర్సిటీలో విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ములుగులో త్వరలో ఏర్పాటు చేయనున్న ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్య,ఉపాధి అవకాశాలు 80శాతం గిరిజనులకే కల్పించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో గిరిజన శక్తి ఆధ్వర్యంలో ట్రైబల్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఈ క్రమానికి గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ అధ్యక్షత వహించగా బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నవంబర్ రెండో వారంలో సరూర్‌నగర్ స్టేడియంలో లంబాడీల సింహగర్జన మహాసభను నిర్వహించనున్నట్లు శరత్‌నాయక్ తెలిపారు.అనంతరం 34అంశాలతో గిరిజన డిక్లరేషన్‌ను విడుదల చేశారు.గిరిజనులు ఎక్కువ శాతం ఉన్న జనరల్ ఎమ్మెల్యే సీట్లలో 10సీట్లను ఎస్టీలకు కేటాయించాలి, జీవో నంబర్-3ను పునరుద్ధరించాలి, ట్రైబల్ వర్సిటీలో 80 శాతం ఉద్యోగాలు, సేవలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి, ఎస్టీ కమిషన్ ఏర్పాటు, పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి తదితర అంశాలను డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి నాయకులు సుబ్బునాయక్, రాజునాయక్, విజయ్‌నాయక్, సిద్ధార్థనాయక్, ఓయూ నేతలు హనుమంత్‌నాయక్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

యోగా శిక్షణ

కూకట్‌పల్లి: సద్గురు యోగా సాధన కేంద్రం, గోకుల్ ప్లాట్స్ బ్రాంచ్ 3వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఆదివారం గోకుల్ ప్లాట్స్ వద్ద ఉన్న క్వాంటమ్ లీప్ స్కూలులో ఉదయం 5.30 గంటలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. పూజ్య గురూజీ నరేంద్ర బంధుజీ ఈ యోగా తరగతుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి రోజూ నిర్వహించే యోగా తరగతులను నామమాత్రపు ఫీజుతో నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ ఇన్‌చార్జి మందపాటి చంద్రశేఖర్, జీవీఆర్ తెలిపారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం మల్లికార్జుననగర్ కాలనీ వాటర్ వర్క్స్ కార్యాలయం సమీపంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వాటర్ వర్క్స్ మేనేజర్ తేజతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, మేకల హరినాథ్, ఖదీర్, కృష్ణారెడ్డి, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, జంగీర్, సోఫీ, అశోక్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, జీకే కుమార్, సంపత్, వీరేష్, కేశవ్, ఇర్ఫాన్, ఇస్మాయిల్, నాగేష్, ప్రదీప్, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలి

మియాపూర్: మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్‌లోని నీలిమ హైట్స్, గ్రీన్స్‌లో మెడికవర్ ఆసుపత్రి చందానగర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలతో పాటు ఈసీజీ తదితర పరీక్షలను వైద్యులు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం, నడక, యోగా వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆదిత్య, రామ్, వింధ్య, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రమేష్, సాంబశివరావు, సీతారాం, రాజేంద్రప్రసాద్, రాహుల్, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో దాండియా జోష్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలో దాండియా జోష్ మొదలైంది. మల్లారెడ్డి గార్డెన్స్‌లో ఈ నెల 15 నుంచి తొమ్మిది రోజుల పాటు 'ఎస్‌కే నవరాత్రి ఉత్సవ్-2023' పేరిట మెగా ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం మల్లారెడ్డి గార్డెన్స్‌లో టికెట్ లాంచింగ్ ఏర్పాటు చేశారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, కార్పొరేటర్ సామల హేమ ముఖ్య అతిథులుగా హాజరై దాండియా ఉత్సవాలను ప్రారంభించారు. ప్రతీ రోజూ రాత్రి 7.00 గంటలకు ప్రారంభమై, అర్ధరాత్రి వరకు వేడుకలు కొనసాగుతాయని నిర్వాహకులు శ్రీకాంత్ వెల్లడించారు. రూ.1,499 చెల్లించి తొమ్మిదిరోజుల సీజన్ పాస్ పొందిన వారికి మొదటి ఐదు రోజుల పాటు రాత్రి డిన్నర్ కూడా అందించనున్నట్లు తెలిపారు. డే పాస్ రూ.399 ఉంటుందని, పాస్‌ల కోసం బుక్ మై షో, పేటీఎం ఇన్‌సైడర్, ఆల్‌ఈవెంట్స్.ఇన్ లేదా 7330655466 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వేడుకలకు హాజరయ్యే వారు సాంప్రదాయ దాండియా దుస్తులు ధరించాలని సూచించారు.

మోడ్రన్ ఫంక్షన్ హాల్ అలంకారప్రాయమేనా?

- ప్రారంభించినా అందుబాటులోకి రానివైనం
- బస్తీవాసులకు తప్పని నిరాశ
- ఎప్పుడు ప్రారంభిస్తారో అంటూ ఎదురుచూపులు
- వాహనాల అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా పరిసరాలు



భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపం వద్ద పార్క్ చేస్తున్న వాహనాలు



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన మోడ్రన్ కల్యాణ మండప శిలాఫలకం

చింతల్: చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్‌లో బస్తీల అభివృద్ధిలో భాగంగా 2017లో సుమారు రూ. 4.30 కోట్ల వ్యయంతో నిర్మించిన మోడ్రన్ ఫంక్షన్ హాల్ అలంకార ప్రాయంగానే మారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2015లో రూ. 1.70 కోట్లతో చేపట్టిన ఈ మోడ్రన్ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని నాలుగేళ్లపాటు సాగదీసి నిర్మాణాన్ని పూర్తి చేశారు. అనంతరం ఈ మోడ్రన్ కల్యాణ మండపం ప్రారంభించిన నాటికి మరింత వ్యయం కావడంతో పేదల కోసం అంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పారు. 2022 జనవరి 25న పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద చేతుల మీదుగా మోడ్రన్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. దీంతో స్థానిక బస్తీల ప్రజలు ఫంక్షన్ హాల్ అందుబాటులోకి వస్తుందని సంతోషపడ్డారు. అయితే 20 నెలలు దాటినా ఇప్పటివరకు అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించలేదు సరి కాదు పేద ప్రజల ఆశలు అడియాసలుగా మారిపోయాయి.

అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా...

చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ. 4.30 కోట్లతో చేపట్టిన ఈ మోడ్రన్ ఫంక్షన్ హాల్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంగా మారుతోందే తప్ప పెళ్లిళ్లకు కేంద్రంగా మారలేదు. భగత్ సింగ్‌నగర్‌లో ఉండే కొంత మంది మోడ్రన్ కల్యాణ మండపం చుట్టూ తమ వాహనాలను నిలుపుతున్నారు. రోజుల తరబడి ఇలాగే వదిలేస్తుండటంతో మోడ్రన్ కల్యాణ మండపంలోనికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో కల్యాణ మండప ఆవరణలోనే కంటి వెలుగు కేంద్రం, ఇటీవల వార్డు కార్యాలయం ప్రారంభించడంతో కల్యాణ మండపం కలగానే మారిపోనుందంటూ భగత్ సింగ్ నగర్ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా కల్యాణ మండపం ఎదురుగా అక్రమంగా రోజుల తరబడి తమ భారీ వాహనాలను నిలుపుతుండటంతో పాటు కార్యాలయానికి, అదే విధంగా కంటి వెలుగు పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కల్యాణ మండప ఆఫీసు కాస్తా వార్డు కార్యాలయంగా...

గత 20 నెలలుగా భగత్ సింగ్ నగర్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఖాళీగా ఉంది కదా అని ఫంక్షన్ హాల్ కార్యాలయంలో ఉన్న నూతన భవనాన్ని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంగా మార్చేశారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం


మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్

రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ

నిజాంపేట్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పలు సంక్షేమ పథకాల ద్వారా వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చింతల్ డివిజన్ పరిధి రోడామేస్త్రీనగర్‌లో నిర్మించనున్న ఈద్గా, ముస్లిం గ్రేవ్‌యార్డు పనులకు ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం గాజులరామారంలోని మహారాజా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ... మైనార్టీలను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంక్‌గా భావించేవని, కాని నేడు సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. పేద ముస్లిం ఆడబిడ్డల వివాహాలకు షాదీముబారక్ పథకం ద్వారా లక్ష నూట పదహారు రూపాయలు అందిస్తోందని, మౌజాం, ఇమామ్‌లకు వేతనాలు చెల్లిస్తోందన్నారు.

- అదే విధంగా రంజాన్ పండగను పురస్కరించుకుని బట్టలు, తోఫా అందిస్తున్నామని, మైనార్టీల కోసం గురుకులాలను ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థిపై లక్షా 25 వేల రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు.
- మైనార్టీల సంక్షేమానికి పాటు పడుతున్న ఏకైన ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని ఆదరించాలని ఆయన కోరారు.
- నిజాంపేట్ కార్పొరేషన్ డబుల్‌బెడ్‌రూమ్ సముదాయం వద్ద ముస్లిలకు కేటాయించిన గ్రేవ్ యార్డ్, ఈద్గా పనులను మహమూద్ అలీ ప్రారంభించారు.
- కార్యక్రమంలో మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ రామకృష్ణరావు, కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, బాలాజీనాయక్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


నిజాంపేట్‌లో ఈద్గా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మహమూద్ అలీ, ఎమ్మెల్యే వివేకానంద్

మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక చేయూత

కుత్బుల్లాపూ ఎమ్మెల్యే వివేకానంద్


ఫాక్స్‌సాగర్‌లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మత్స్యకార కుటుంబాలు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కుత్బుల్లాపూ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువులో మేడ్చల్ జిల్లా డీఎఫ్ఓబీ పూర్ణిమ, జిల్లా ఫిషరీష్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజుతో కలిసి ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 2016 నుంచి సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ చేపట్టిందన్నారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది కుటుంబాలకు లబ్ది చేకూరుతోందన్నారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్, ముదిరాజ్ సంక్షేమ సంఘ నాయకులు స్వామి ముదిరాజ్, మత్స్య పారిశ్రామికశాఖ సంఘం ఫాక్స్ సాగర్ జీడిమెట్ల అధ్యక్షుడు చిలుకూరి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి యాదమ్మ, కార్యదర్శి ఎమ్.వీరేష్, మత్స్యకారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ కార్యవర్గం

సుభాష్‌నగర్ డివిజన్ డీపీ కాలనీకి చెందిన శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఆలయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కమిటీ చైర్మన్ సుధీర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరేశం గౌడ్, మాజీ అఫీషియ మెంబెర్ శంకర్ శాస్త్రి, రంగస్వామి, పృథ్వీరాజ్, ఆశ, విజయ్ కుమార్, లలిత్‌గౌడ్, ధాన్య సురేంద్రన్, ఆలయ అర్చకులు శంకర్ శర్మ, వెంకటేష్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎండ నుంచి రక్షణగా...

సుభాష్‌నగర్: గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కాలనీ బస్తీలు తడిసి ముద్దవగా, గత నాలుగైదు రోజులు ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 11 గంటల నుంచి వేసవి కాలం మాదిరిగా ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే గొడుగుల సహాయంతో వస్తున్నారు.



సేవాకార్యక్రమాలకు ప్రాధాన్యం



నూతన అధ్యక్షుడు డాక్టర్ రామ్‌తిలక్‌కు గేవెల్‌ను ప్రదానం చేస్తున్న డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు

నిజాంపేట్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ వందేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తోందని లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు అన్నారు. ఆదివారం నిజాంపేట్ బండారి లేఅవుట్‌లో జరిగిన హైదరాబాద్ ప్రగతి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్ రాజు మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని, తమది ప్రపంచంలోనే పెద్ద సంస్థ అని, గిరిజన ప్రాంతాల్లో సైతం తమ సేవలను విస్తృత పరిచామని పేర్కొన్నారు. గీతం టీవీ చైర్మన్, డాక్టర్ చెరుకూరి రామ్‌తిలక్ అధ్యక్షుడిగా, జగ్గయ్య కార్యదర్శిగా, గోపి రాజు కోశాధికారిగా, లయన్ సత్యవోలు రాంబాబు, ఎల్లా సుబ్బారెడ్డి, డాక్టర్ మహేశ్ పగడాల, తోట రామకృష్ణ, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, శిల్పలత, మల్లీశ్వరి, అరుణశ్రీ, కృష్ణ మురళి, మాల్యాద్రి, ప్రశాంత్ రెడ్డి, మేఘన నూతన సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ పీఆర్వో లయన్ యాదయ్యగౌడ్, లయన్స్ చందు ముదిరాజ్, వెంకటేశ్వర దాస్, మర్రి భిక్షపతి, నరసింహ రాజు, ఈశ్వర్ రెడ్డి, పి.ఎస్.ఎన్.రాజు, శ్రీనివాస్, లింగయ్య, కిశోర్ కుమార్, సంపత్, రమాకాంత్, పవన్, విజయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో బ్రెస్ట్ కేన్సర్‌కు చెక్


బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని, నలభై సంవత్సరాలు దాటిన వారు తరచూ పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలని గైజకాలజిస్ట్ డాక్టర్ నబాత్ లఖాని అన్నారు. ఆదివారం కొంపల్లి కమిటీ హాలులో ఎన్‌జీవో మర్‌హమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రెస్ట్ కేన్సర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నబాత్ మాట్లాడుతూ... ప్రతి నాలుగు గంటలకు ఒకరు చొప్పన బ్రెస్ట్ కేన్సర్ బారిన పడుతున్నారని, దీని బారిన పడకుండా ఆహార అలవాట్లు మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో మహిళల్లో అవగాహన పెంచి కేన్సర్ బారిన పడకుండా సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సొహైల్, వికిత, డాక్టర్ నవ వికాస్, డాక్టర్ గౌతమి, డాక్టర్ వర్షా సక్సెనా, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ కావ్యా, మాజీ సింగిల్ విండో డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జెమ్మి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పంపిణీలో పేదలకు అన్యాయం: బీజేపీ

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 15 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేశామని గొప్పలు చెబుతున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు స్థానికులకు తీరని అన్యాయం చేశారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బహదూర్‌పల్లి, దుండిగల్, బౌరంపేట్, గాజులరామారం, డీపోచంపల్లి ప్రాంతాల్లో ఇటీవల అందజేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో స్థానికులకు 10 శాతం కూడా ఇళ్లను ఇవ్వలేదన్నారు. ఒక వైపు సికింద్రాబాద్, సనత్‌నగర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమ ప్రాంతానికి చెందిన వారికే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇతర ప్రాంతాలకు చెందిన వారికి స్థానికంగా ఇళ్లను కేటాయిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, మైనింగ్‌కు కేటాయిస్తున్న ప్రభుత్వం స్థానికంగా వేలాది ఉద్యోగావకాశాలు కల్పించే ఐటీ కంపెనీలకు మాత్రం స్థలాలు కేటాయించడం లేదన్నారు. దుండిగల్‌లో ఇళ్ల పట్టాలున్న 600 మందికి ఇప్పటికి పొజిషన్‌లు చూపించలేదని ఆరోపించారు. ఇకనైనా స్థానికులకు 10 శాతం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి


మేయర్ నీలారెడ్డిని కలిసిన కాలనీ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: కార్పొరేషన్ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ నాయకుడు వెంగయ్యచౌదరి ఆధ్వర్యంలో 14వ డివిజన్ వెంకట్రాయనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మేయర్, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కాలనీలో కమిటీ హాలు, ఓపెన్ జిమ్, పార్కులో వాచ్‌మెన్ గది, టాయిలెట్లను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా కమిటీ హాలులో టాయిలెట్ల పనులు చేపట్టాలని కోరగా మేయర్ సానుకూలంగా స్పందించారు. కాలనీ ప్రెసిడెంట్ కుర్ర శ్రీనివాస్, అసోసియేషన్ మెంబర్లు రామకృష్ణ, బలుసు శ్రీనివాస్, లక్ష్మణ్, స్వరూపరావు, గిరిధర్, చందు, శరత్, దిలీఫ్, బాపూజీ, రామ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మల అభ్యున్నతికి కృషి


సమావేశంలో పాల్గొన్న విశ్వకర్మ అసోసియేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: విశ్వకర్మీయులు ఆర్థికంగా, సామాజికంగా వృద్ధి చెందేందుకు కృషి చేస్తామని గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్ విశ్వకర్మ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కోజి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి విశ్వకర్మీయుల సంక్షేమానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో సలహాదారు అనుపోజు సోమేశ్వరరావు గురు స్వామి, ఉపాధ్యక్షుడు జగదీష్ గురు స్వామి, జనరల్ సెక్రటరీ కుప్పిలి కోటేశ్వరరావు, ట్రెజరర్ సూర్య, జాయింట్ సెక్రటరీ లోకేష్, తిరుపతి, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

సుభాష్‌నగర్: రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు పాదు తీస్తున్న క్రమంలో ఓ వ్యక్తికి విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన సూరారంలో చోటుచేసుకుంది. వివరాలివీ... సూరారం ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ఆధునీకీకరణ నిమిత్తం ఓ కంపెనీ కాంట్రాక్ట్ దక్కించుకొని పనులు చేపడుతోంది. శనివారం రాత్రి 10 గంటల సమయంలో సిబ్బంది పనిచేస్తున్న క్రమంలో విద్యుత్ లైట్ల నిమిత్తం డివైడర్ లోపల నుంచి వేసిన కరెంట్ వైర్ తగడంతో షాక్‌కు గురై ఓ సిబ్బంది అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో తోటి సిబ్బంది వెంటనే అతనని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

జీడిమెట్ల: మతిస్థిమితం లేని ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ సమాచారం మేరకు... భగత్‌సింగ్ నగర్‌కు చెందిన గుడ్ల కురుమూర్తి కుమారుడు రాకేష్(18)కు మతిస్థిమితం సరిగా లేదు. కురుమూర్తికి గాజులరామారం ఎల్ఎన్‌బీ నగర్‌లో వెల్డింగ్ షాపు ఉంది. శనివారం సాయంత్రం రాకేష్‌ను సైతం తనతో పాటు షాపు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడే ఉన్న రాకేష్ ఎక్కడికో వెళ్లిపోయాడు. రాకేష్ కోసం కురుమూర్తి చుట్టు పక్కల వెతికినా అతని జాడ దొరకలేదు. ఆదివారం కురుమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కొలన్ శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



బీఆర్‌ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించిన దృశ్యం

నిజాంపేట్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నిజాంపేట్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు ఆయన్ని సన్మానించి కేక్ కట్ చేయించారు. నిజాంపేట్ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవికాంత్, ఆవుల జగదీష్, చందుముదిరాజ్, బాలకృష్ణారెడ్డి, జర్నలిస్ట్ కాలనీకి చెందిన రాముయాదవ్, పితాని శ్రీనివాసరావు, మల్లికార్జున్, వెంకట్ రావు, లక్ష్మణ్, ప్రేమ్ కుమార్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్రకళా ప్రదర్శన


వస్త్రకళా హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రదర్శనలో కొనుగోలుదారులు సందడి

నిజాంపేట్: ప్రగతినగర్ శ్రీకృష్ణ గార్డెన్‌లో వస్త్రకళా హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో చేనేత వస్త్రాలు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన చీరలు, కాటన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గృహ ఉపకరణాలు, కళాకారులచే తయారు చేసిన బొమ్మలు అందరికీ అందుబాటులో ఉంచామని నిర్వాహకులు సింహాద్రి తెలిపారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని మూడు కాటన్ టాప్‌లు రూ.వెయ్యికే అందిస్తున్నామన్నారు. అదే విధంగా ఈ ప్రదర్శనలో వన్‌గ్రామ్ గోల్డ్ జైపూర్ స్టోన్ జ్యువెలరీ ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి అందుబాటులో ఉంటుందని, కొద్ది రోజులు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు అమృతం స్వర్ణామృత ప్రాశన



కూకట్‌పల్లి: ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజున 16 ఏళ్ల లోపు పిల్లలకి 2 చుక్కలు స్వర్ణామృత ప్రాశనను వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం యోగేష్ ప్రభు అందజేశారు. ఈ స్వర్ణామృత ప్రాశన వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి మెదడును ఉత్తేజపరుస్తాయన్నారు. ఈ ద్రవ్యాలు, దేశీ ఆవునెయ్యి, తేనెతో తయారు చేయబడిన ఒక ప్రత్యేకమైన చుక్కల రూపంలోని టీకా పద్ధతి అని, దీనిని సరైన మోతాదులో 16 ఏళ్లలోపు పిల్లలకు ఇవ్వబడుతుందని తెలిపారు. దీని వాడటం వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెంచటంతో పాటు మాటలు ఆలస్యంగా వస్తున్న పిల్లలకు సహాయ పడుతందని, శరీర క్రియలు వేగవంతం చేస్తుందని తెలిపారు. పిల్లల ఆలోచనలను పెంపొందిస్తుందని, అతి ప్రవృత్తి పిల్లల్ని మెరుగుపరుస్తుందన్నారు. అరుగుదలని మెరుగు పరుస్తుందని ఇటువంటి ప్రత్యేక లక్షణాలు ఈ స్వర్ణామృత ప్రాశన తీసుకోవటం వల్ల కలుగుతాయని యోగేష్ ప్రభు తెలిపారు.